శనార్తి తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 296 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | మంగళవారం 16-06-2026 | పేజీలు : 2

పెరిగిన రూపాయి విలువ..!

- డాలర్ తో పోలిస్తే.. 94.60 చేరిన రూపాయి
- తగ్గిన క్రూడాయిల్ ధరలు
- లాభాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు..!

2

ఈనెల 25 నుంచి సర్ షురూ

- జులై 24 వరకు సర్వే పూర్తి
- ఇంటింటికి తిరుగుతాం
- మొత్తం 3 దశల్లో సర్వే ఉంటుంది
- ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరిస్తాం
- ఏమైనా సందేహాలుంటే పునఃపరిశీలన చేస్తాం
- అక్టోబర్ 01 తుది ఓటర్ జాబితాను జీపీ అంటిస్తాం
- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

2

సర్కార్ అట్టర్ ఫ్లాప్

- మెట్రో ఫేజ్ 2 సాధించడంలో విఫలం
- అసమర్థతను దాచుకునేందుకు రేవంత్ అబద్దాలు
- 71 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టిండు
- బడేభాయ్‌ని మెప్పించి ప్రాజెక్టు ఒప్పించలే
- దద్దమ్మ పాలనకు నిలువెత్తు నిదర్శనం
- సీఎం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి
- మాజీమంత్రి కేటీఆర్

2

యాదాద్రిలో ప్రైవేటు చిచ్చు..

రూ.255 కోట్ల టెండర్‌తో థర్మల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు స్కెచ్

తెలంగాణ విద్యుత్‌పై మళ్లీ ఆంధ్రా పెత్తనం..?

కార్పొరేట్లకు అప్పగించేందుకు సర్కార్ చకచకా అడుగులు

రూ.20 వేల కోట్ల ప్రాజెక్టు.. రూ.37 వేల కోట్ల బడ్జెట్..

- తీరా చూస్తే ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తమా..?
- సైలెంట్‌గా నోటిఫికేషన్ నంబర్ ఇష్యూ..
- మూడేండ్ల కాంట్రాక్టు వెనుక అసలు అంతర్యమేమిటి?
- తక్కువ వేతనాలు.. ఉద్యోగ గ్యారంటీ సున్నా..
- ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్తే కార్మికుల బతుకులు అంధకారమే
- వైటీపీఎస్‌ను కాపాడండి.. జెన్‌కోను రక్షించండి
- 1300 మంది విద్యుత్ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు
- 450 మంది ఇంజనీర్లు, వందలాది ల్యాండ్ లూజర్లు..
- రోడ్డెక్కుతున్న యాదాద్రి ప్లాంట్ జేఏసీ
- ఆరని నిర్వాసితుల కడుపు మంట..
- నేటికీ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న దామరచర్ల రైతులు
- భూములు కోల్పోయి రోడ్డున పడ్డ జనం..
- ఉన్న ఉద్యోగాలకూ ఎసరు పెడుతున్న ప్రైవేట్ టెండర్లు

శనార్తి తెలంగాణ, హైదరాబాద్ : స్వరాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలకు, తెలంగాణ స్వయంసమృద్ధికి ప్రతీకగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కాంగ్రెస్ సర్కార్ ప్రైవేటు శక్తులకు దారాదత్తం చేసేందుకు సిద్ధమయ్యింది. నాడు కరవు చీకట్లను తరిమికొట్టేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో నిర్మించిన ఈ ప్లాంట్‌పై నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.255 కోట్ల అంచనాతో ప్రైవేట్ టెండర్ల చిచ్చు రగిల్చింది. మలిదశ ఉద్యమంలో ఏ ఆంధ్రా పెత్తనం పైతే జనం తిరగబడ్డారో.. మళ్లీ అదే శక్తుల చేతుల్లోకి ఈ భారీ ప్రాజెక్టును పెట్టేందుకు తెరవెనుక చకచకా అడుగులు పడుతుండటంతో 1300 మంది విద్యుత్ ఉద్యోగుల భవితవ్యం అంధకారంలోకి నెట్టబడింది. రూ.20 వేల కోట్ల అంచనాతో మొదలై, కాంగ్రెస్ ప్రభుత్వ కాలయాపన వల్ల రూ.37 వేల కోట్లకు చేరిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) నిర్వహణను సైలెంట్‌గా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ స్కెచ్ వేసింది. అందుకు సంబంధించి గుట్టుచప్పుడు కాకుండా టెండర్ నోటిఫికేషన్‌ను సైతం జారీ చేసినట్టు తెలుస్తోంది. మూడేళ్ల కాంట్రాక్టు కాలపరిమితితో, రూ.255 కోట్ల విలువైన ఈ ఓపెన్ టెండర్ ద్వారా ఆంధ్రా పెట్టుబడిదారులకు ప్లాంట్‌ను అప్పగించేందుకు

తరువాయి 2లో...

ఒప్పందం ఒకవైపు..!

ఆక్రమణలు మరోవైపు..!

- యూఎస్-ఇరాన్ ఒప్పందానికి ఇజ్రాయిల్ గండి..?
- ఆక్రమిత భూభాగాల నుంచి వైదొలగాలని టెహ్రాన్ షరతు
- అస్సలు వెనక్కు తగ్గబోమంటున్న ఇజ్రాయిల్
- లెబనాన్‌పై ఐడీఎఫ్ భీకర వైమానిక దాడులు
- టెల్ అవీవ్ వైఖరిపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం
- ఈనెల 19న అమెరికా-ఇరాన్ ఒప్పందంపై ప్రపంచ దృష్టి
- ఇజ్రాయిల్ తీరుతో శాంతి ప్రయత్నాలు
- మళ్లీ మొదటికే వచ్చే ప్రమాదం..!

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయనే ఆశలు చిగురిస్తున్న వేళ ఇజ్రాయిల్ ప్రకటన కొత్త అనుమానాలకు తావిస్తోంది. లెబనాన్‌లో తాము ఆక్రమించిన భూభాగాల నుంచి వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి స్పష్టం చేయడం కొత్త చర్చకు దారి తీసింది. ఇరాన్-అమెరికా పాకిస్తాన్ మధ్యవర్తిగా ఈనెల స్విస్‌లో పీస్ డీల్‌పై సంతకం చేయాల్సి ఉంది. ఇరు దేశాల మధ్య తాత్కాలిక ఒప్పందం కుదరనుంది. ఈ నేపథ్యం లోనే టెల్ అవీవ్ నుంచి వచ్చిన ప్రకటన శాంతి ఒప్పందానికి ఎక్కడ గండి కొడుతాయోననే టెన్షన్ వెంటాడుతోంది. గత రెండేళ్లలో గాజా, లెబనాన్, సిరియా ప్రాంతాల్లో ఇజ్రాయిల్ తన నియంత్రణను విస్తరించుకుంది. సుమారు వెయ్యి చదరపు కిలోమీటర్ల మేర భూభాగం ఇజ్రాయిల్ ఆధీనంలోకి వెళ్లినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలను బట్టి అర్థమవుతోంది.

2

‘రాజ్యాధికార సమరభేరి’ సభను విజయవంతం చేయండి

జులై 5న భువనగిరి బాట పట్టండి

- మన బీసీల సత్తా ఏమిటో అగ్రవర్ణ పార్టీలకు చూపిద్దాం
- బహుజనుల రాజ్యాన్ని సాధిద్దాం
- టీఆర్పీ రాష్ట్ర నాయకుల పిలుపు
- పలువురు ప్రముఖులకు సభ ఆహ్వాన పత్రికల అందజేత

శనార్తి తెలంగాణ, హైదరాబాద్ : తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జులై 05న భువనగిరిలో నిర్వహించే "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని.. "బీసీల సత్తా ఏమిటో అగ్రవర్ణ పార్టీలకు చూపిద్దాం.. బహుజనుల రాజ్యాన్ని సాధిద్దాం" అని టీఆర్పీ రాష్ట్ర నాయకుల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులకు సభ ఆహ్వాన పత్రికలను అందజేశారు. దీనిలో భాగంగా రిటైర్డ్ ఎంఆర్వో డీఎల్ నర్సయ్యకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు గిరగాని భిక్షపతి గౌడ్, అర్కటి శ్రీనిధి,అర్కటి పావని, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ముదిరాజ్ కు ఆహ్వానం

టీఆర్పీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క ఆధ్వర్యంలోని బృందం బుల్లెట్ వెంకన్న ముదిరాజ్ కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు భిక్షపతి గౌడ్, అర్కటి పావని, శ్రీనిధి, రాజు పాల్గొన్నారు.

తరువాయి 2లో...

తెలంగాణలో మోగిన బడి గంట

బ్రేక్ ఫాస్ట్‌తో తెరుచుకున్న పాఠశాలలు

- 52 రోజుల వేసవి సెలవుల తర్వాత స్కూల్స్ ఓపెన్
- 8 జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రభుత్వం సీఎం బ్రేక్ ఫాస్ట్ విత్ మిల్క్
- 3 రోజులు పాలు.. 3 రోజులు రాగి జావ..

శనార్తి తెలంగాణ, హైదరాబాద్ : తెలంగాణవ్యాప్తంగా సుదీర్ఘ వేసవి విరామం తర్వాత పాఠశాలలు మళ్లీ కళకళలాడాయి. దాదాపు 52 రోజుల సెలవుల అనంతరం సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు తిరిగి పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజే విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ‘సీఎం బ్రేక్ ఫాస్ట్ విత్ మిల్క్’ పథకాన్ని అధికారికంగా ప్రారంభించింది. రాష్ట్రంలోని 8 జిల్లాల్లో ఎంపిక చేసిన సుమారు 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఉచిత అల్పాహార పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని రాజ్ భవన్ ప్రభుత్వ పాఠశాలలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.

తరువాయి 2లో...

బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు వేయొద్దు

- కటౌట్లు పెట్టొద్దు, బ్యానర్లు కట్టొద్దు
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలే
- స్వంత పార్టీ నేతలైనా ఉపేక్షించం
- తమిళనాడు సీఎం విజయ్ సంచలన ప్రకటన
- ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే సహించనని హెచ్చరిక

2

స్కూల్ బస్సులపై రవాణాశాఖ ఉక్కుపాదం..!

- రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టిన అధికారులు
- 245 వాహనాలపై కేసు నమోదు
- 60 స్కూల్ బస్సులు సీజ్..!
- విద్యా సంస్థల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించాలి
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- హెచ్చరించిన రాష్ట్ర రవాణ శాఖ

2

ఈనెల 25 నుంచి సర్ షురూ

శనార్తి తెలంగాణ, హైదరాబాద్: ఈనెల 25 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. జులై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించి ధృవీకరిస్తారని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను సవీకరించే లక్ష్యంతో ఈ సర్వేను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జులై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఓటర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సందేహాలు, సవరణ అభ్యర్థనలను పరిశీలించి అవసరమైతే పునఃపరిశీలన చేపడతామని తెలిపారు. ఇప్పటికే ఓటరు జాబితాలో గుర్తించిన డూప్లికేట్ నమోదులు, చిరునామా మార్పులు, మరణించిన వారి వివరాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది బీఎల్‌వోలు ఈ ప్రక్రియలో పాల్గొంటారని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుతామన్నారు. అన్ని అభ్యంతరాల పరిష్కారం అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేసి గ్రామ పంచాయతీలు, ఎన్నికల కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు.

‘రాజ్యాధికార సమరభేరి’ సభను విజయవంతం చేయండి

మొదటిపేజీ తరువాయి...

గొట్టిముక్కల మాధవాచారికి ఆహ్వానం

పటేల్ వనజక్క అధ్వర్యంలో హెచ్ఆర్‌పీడబ్ల్యూ ఏఓ మీడియా చైర్మన్ గొట్టిముక్కల మాధవాచారికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు గిరగాని భిక్షపతి గౌడ్, అర్కటి పావని, అర్కటి శ్రీనిధి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనుకు ఆహ్వానం

పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సోమ శ్రీనును కలిసి సభ ఆహ్వాన పత్రిక అందజేశారు. చెరువులో చేపలు పడుతున్న క్రమంలో నేరుగా చెరువులోకి దిగి వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్పీ వుమెన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు, బీసీ వర్గాల రాజకీయ సాధికారత అవసరం, రాజ్యాధికార లక్ష్యాలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి మహిళ అధ్యక్షురాలు శాలిని గారు, కార్యదర్శి వనజ గారు పాల్గొన్నారు.

భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్‌ను కలిసిన టీఆర్పీ నాయకులు

టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ నేతృత్వంలో టీఆర్పీ నాయకులు భువనగిరి జిల్లా ఎస్పీ ఐపీఎస్ అక్షాంశ్ యాదవ్ ను కలిసి సభ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలకు సౌకర్యాలు వంటి అంశాలపై సవివరంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదేల్ యాదవ్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్, రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ అనిల్ వీరమల్లు.భువనగిరి జిల్లా అధ్యక్షుడు సరసింహులు, రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్, రంగయ్య, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు షాలిని, ఉపాధ్యక్షురాలు సౌభాగ్య, కార్యదర్శి వనజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు వేయొద్దు

శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్: బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు వేయొద్దని, కటౌట్లు పెట్టొద్దని, బ్యానర్లు కట్టొద్దని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం తమ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కార్యక్రమాలు, సభలు, నాయకుల పర్యటనల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిబంధనలు అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలకు వర్తియన్నారు. ప్రజా రహదారులు, కూడళ్లు, ప్రభుత్వ స్థలాలు, విద్యుత్ స్తంభాలపై పోస్టర్లు అతికించడం, అనుమతి లేకుండా కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని, స్వంత పార్టీ నేతలైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రాజకీయ కార్యకలాపాల కంటే ప్రజల సౌకర్యం, భద్రత ముఖ్యమన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయన్నారు. పార్టీ కార్యకర్తలు చట్టాలను గౌరవిస్తూ ఆదర్శప్రాయంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల అరాచకాలను అడ్డుకోవాలి

- అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలి
- అడ్డగోలుగా హోర్డింగుల ఏర్పాటు
- మొద్దు నిద్రలో విద్యాశాఖ అధికారులు
- నిబంధనలు పాటించని విద్యాసంస్థల అనుమతులను రద్దు చేయాలి
- ప్రజావాణిలో టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఫిర్యాదు
- చర్యలు తీసుకోకుంటే తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరిక

శనార్తి తెలంగాణ, కరీంనగర్ : కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం బాధాకరమని టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా నాయకులతో కలిసి ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రజావాణిలో కలెక్టర్‌లు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫార్మ్‌లు, ఇతర పేర్లతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మరోవైపు విద్యార్థుల పరీక్షా ఫలితాలను నిబంధనలకు విరుద్ధంగా భారీ హోర్డింగులు, ఫ్లెక్సీల రూపంలో ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించి అడ్మిషన్లు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అక్రమ హోర్డింగులపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టౌన్ ప్లాన్ అధికారులు చర్యలో తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ అక్రమాలన్నీ కళ్ల ముందే జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అఖిల్ పాషా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక లావణ్య, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు ఓర్సు రాజు, అమ్మిగళ్ల కుమార్, ఓర్సు విమల తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన రూపాయి విలువ..!

- డాలర్ తో పోలిస్తే.. 94.60 చేరిన రూపాయి
- తగ్గిన క్రూడాయిల్ ధరలు
- లాభాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు..!
- అమెరికా - ఇరాన్ శాంతి ఒప్పందంతో భారీగా మార్పు

శనార్తి తెలంగాణ, ఢిల్లీ : గత కొద్ది రోజులుగా అమెరికన్ డాలర్‌తో పోలిస్తే బలహీనపడిన రూపాయి విలువ తిరిగి పుంజుకుంటుంది. అమెరికా – ఇరాన్ దేశాల శాంతి ఒప్పందం నేపథ్యంలో.. సోమవారం ట్రేడింగ్‌లో డాలర్‌పై రూపాయి ఏకంగా 58 పైసలు లాభపడింది. ప్రస్తుతం డాలర్ వద్ద రూపాయి విలువ 94.60 కి పెరిగింది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధానికి ముగింపు పలుకుతూ ఒప్పందం కుదిరినట్లు యూఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు కూడా భారీగా పడిపోయాయి.యుద్ధం మొదలైన తర్వాత 110 డాలర్ల పైకి చేరిన ముడి చమురు ధర ఇప్పుడు బ్యారెల్‌కు 80 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. ఈ పరిణామం భారత దేశం వంటి భారీగా ఆయిల్ దిగుమతి చేసుకునే దేశాలకు మేలు చేస్తుంది. దీంతో దేశంలోకి వచ్చే చమురు దిగుమతి బిల్లు గణనీయంగా తగ్గుతుంది. ఈ క్రమంలో దేశంలోనూ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశించినప్పటికీ. ధరలు తగ్గుముఖం పట్టెలకనిపించడం లేదు.

యుద్ధం సమయంలో వెచ్చిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేయాలనే ఆలోచనతో పాటు.. ఆయిల్ కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి కూడా ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు దేశీయ స్టాక్ మార్కెట్లు బలమైన లాభాలతో ప్రారంభం కావడం గమనార్హం..! సెన్సెక్స్ ఏకంగా 1,100 పాయింట్లకు పైగా ఎగబాకింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 736 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 231 పాయింట్లు లాభపడింది. సెన్సెక్స్ ఉదయం 76,725.27 పాయింట్లవద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,821.07 గరిష్టాన్ని తాకింది. మొత్తంగా 1,100 పాయింట్ల వరకు లాభపడింది.

తెలంగాణలో మోగిన...

మొదటిపేజీ తరువాయి...

సభ అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ సాధారణ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థినికి ఆయనే స్వయంగా టిఫిన్ తినిపించడం అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది. తొలిరోజు మిగతా ఎంపిక చేసిన పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు ఉదయాన్నే వేడివేడి బ్రేక్‌ఫాస్ట్‌ను వడ్డించారు. ఈ పథకం ద్వారా అటు స్కూల్.. ఇటు ఇంటర్మీడియట్ చదువుతున్న సుమారు 1.44 లక్షల మందికి పైగా విద్యార్థులకు నేరుగా లబ్ధి చేకూరనుంది. ఈ పథకం ప్రత్యేకత ఏంటంటే.. ప్రతిరోజూ ఉదయం అందించే అల్పాహారంతో పాటు అదనంగా వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి జావను విద్యార్థులకు పంపిణీ చేస్తారు. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎంపిక చేసిన జిల్లాల్లో ప్రారంభమైన ఈ పోషకాహార అల్పాహార పథకాన్ని, రాబోయే రోజుల్లో విడతల వారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకూ విస్తరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది.

సర్కార్ అట్టర్ ఫ్లాప్

శనార్తి తెలంగాణ, హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టు అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మెట్రో ఫేజ్-2కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడం లేదని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు పురోగతిలో జాప్యానికి ప్రభుత్వ అసమర్థతే ప్రధాన కారణమని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, దీనిని కప్పిపుచ్చుకునేందుకు అనవసర ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. పలుమార్లు ఢిల్లీ పర్యటనలు చేసినప్పటికీ మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన మద్దతు సాధించలేకపోవడం ప్రభుత్వ పనితీరును ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాల ప్రభావం అభివృద్ధి కార్యక్రమాలపై పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. మెట్రో రెండో దశ అమలులో జాప్యం మాత్రమే కాకుండా ప్రస్తుతం నడుస్తున్న మెట్రో వ్యవస్థ విస్తరణపైనా ప్రభుత్వం సరైన దృష్టి పెట్టడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు విజయవంతంగా అమలు కావడంలో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర సహకారం పరిమితంగా ఉన్నప్పటికీ అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రాజెక్టు పనులు నెమ్మదిగా సాగగా, బీఆర్ఎస్ పాలనలో మెట్రో నిర్మాణం వేగవంతమై పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం లక్షలాది మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగిస్తున్నారని, అలాంటి ప్రాజెక్టుపై నిరాధార విమర్శలు చేయడం సరికాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఒప్పందం ఒకవైపు..!

శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయనే ఆశలు చిగురిస్తున్న వేళ ఇజ్రాయిల్ ప్రకటన కొత్త అనుమానాలకు తావిస్తోంది. లెబనాన్‌లో తాము ఆక్రమించిన భూభాగాల నుంచి వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి స్పష్టం చేయడం కొత్త చర్చకు దారి తీసింది. ఇరాన్-అమెరికా పాకిస్తాన్ మధ్యవర్తిగా ఈనెల స్విస్‌లో పీస్ డీల్‌పై సంతకం చేయాల్సి ఉంది. ఇరు దేశాల మధ్య తాత్కాలిక ఒప్పందం కుదరనుంది. ఈ నేపథ్యంలోనే టెల్ అవీవ్ నుంచి వచ్చిన ప్రకటన శాంతి ఒప్పందానికి ఎక్కడ గండి కొడుతాయోననే టెన్షన్ వెంటాడుతోంది. గత రెండేళ్లలో గాజా, లెబనాన్, సిరియా ప్రాంతాల్లో ఇజ్రాయిల్ తన నియంత్రణను విస్తరించుకుంది. సుమారు వెయ్యి చదరపు కిలోమీటర్ల మేర భూభాగం ఇజ్రాయిల్ ఆధీనంలోకి వెళ్లినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలను బట్టి అర్థమవుతోంది. అయితే ఈ ప్రాంతాలను భద్రతా కవచాలుగా పరిగణిస్తున్న ఇజ్రాయిల్, అక్కడి మిలిటెంట్ మౌలిక వసతులను పూర్తిగా నిర్వీర్యం చేసే వరకు వెనక్కు తగ్గబోమనే సంకేతాలు ఇస్తోంది. ఒకవైపు శాంతి చర్చలు, మరోవైపు ఇజ్రాయిల్ ఆక్రమిత భూభాగాలపై పట్టు విడుపులు కొనసాగుతుండడంతో అసలు అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం సాధ్యమేనా అనే సందేహాలు తలెత్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చాన్నాళ్లుగా అగ్ని రాజుకున్న గల్ఫ్ ప్రాంతాల్లో ఇప్పట్లో ఆ మంటలు చల్లారకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇజ్రాయిన్ ఇలా మొండిగా వ్యవహరించడం వెనుక ఆ దేశ ప్రయోజనాలు, దశాబ్దాల చరిత్ర ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. షబా ఫార్మ్స్ ప్రాంతం, దక్షిణ లెబనాన్ సరిహద్దులు, సిరియా గోలాన్ ప్రాంతం వంటి అంశాలు ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉన్నాయి. హెజ్‌బొల్లా వంటి ఇరాన్ మద్దతు గ్రూపులు ఈ ప్రాంతాలను ప్రతిఘటనకు కేంద్రాలుగా ఉపయోగిస్తున్నాయని ఇజ్రాయిల్ ఆరోపిస్తోంది. మరోవైపు ఆక్రమిత భూభాగాలను విడిచిపెట్టకపోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని అరబ్ దేశాలు వాదిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్-అమెరికా ఒప్పందం అమలులోకి వచ్చినా వాస్తవిక పరిస్థితులు మారకపోతే దాని ప్రయోజనం పరిమితంగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరాన్ ప్రత్యక్షంగా లేదా తన ప్రాక్సీ గ్రూప్‌ల ద్వారా స్పందిస్తే సరిహద్దు ఘర్షణలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. స్థానికంగా ప్రారంభమయ్యే చిన్న సంఘటనలు కూడా ప్రాంతీయ యుద్ధాలుగా మారిన ఘటనలు పశ్చిమాసియాలో కొత్తేమి కాదు. అందుకే ఇజ్రాయిల్ ప్రకటనను ఆ దేశ రక్షణ సంబంధిత కామెంట్స్‌గానే భావించకుండా భవిష్యత్ ఘర్షణలకు సూచనగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

ఈ ఉద్రిక్తతల ప్రభావం ఇరాన్, దాని మిత్ర దేశాలు, ఇజ్రాయిల్ వరకే పరిమితం అయ్యే పరిస్థితి అస్సలు ఉండదు. ఇప్పటికే గల్ఫ్‌లో నెలకొన్న టెన్షన్స్ వల్ల ప్రపంచ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు గురవుతున్నాయి. హోర్మూజ్ జలసంధి భద్రత, ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణ అవకాశాలు, చమురు సరఫరాలపై అనిశ్చితి వంటి అంశాలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ఒత్తిడిని పెంచుతున్నాయి. చమురు ధరల్లో రిస్క్ ప్రీమియం పెరిగితే దిగుమతులపై ఆధారపడే దేశాలకు అదనపు భారం తప్పదు. ఇంధన ధరలు పెరిగితే రవాణా, తయారీ, వినియోగ రంగాలపై దాని ప్రభావం కనిపిస్తుంది. ఈనెల 19న ఇరాన్, అమెరికా మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందం కుదిరిలే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే శాంతి ఒప్పందంపై సంతకం పెట్టాలంటే తన మిత్ర దేశాలపై దాడులు చేయొద్దని టెహ్రాన్ కండిషన్ పెట్టింది. ఆది, సోమవారం ఐడీఎఫ్ ఇరాన్ మిత్ర దేశం లెబనాన్‌పై ఎటాక్స్ ఆపలేదు. ఈ నేపథ్యంలోనే అసలు అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదురుతుందా..? కుదిరితే ఇజ్రాయిల్ దుందుడుకు వ్యవహారంతో ఆ పీస్ అగ్రిమెంట్ ఎంత కాలం నిల్వ గలదనేదే ఇప్పుడు ప్రపంచ దేశాలను టెన్షన్‌కు గురి చేస్తోంది.

స్కూల్ బస్సులపై రవాణాశాఖ ఉక్కుపాదం..!

శనార్తి తెలంగాణ, హైదరాబాద్ : నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రవాణా శాఖ రంగంలోకి దిగింది. నిబంధనలు ఉల్లంఘిస్తూ, ఎలాంటి ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు లేకుండా రోడ్డెక్కుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై అధికారులు ఉక్కుపాదం మోపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేకపోవడం, మితిమీరిన వేగం, నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను ఎక్కించుకోవడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన 245 విద్యాసంస్థల వాహనాలపై కేసులు నమోదు చేశారు. మరో 60 స్కూల్ బస్సులను సీజ్ చేశారు. విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటించడంలో అలసత్వం వహిస్తే.. అందుకు పూర్తి బాధ్యత సంబంధిత పాఠశాల, కళాశాల యాజమాన్యాలదేనని రవాణా శాఖ తేల్చి చెప్పింది.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను పంద శాతం పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమానులు, డ్రైవర్లు, యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. కేవలం ఈ ఒక్క రోజుతోనే తనిఖీలు ముగిసిపోలేదని, ముమ్ముందు రోజుల్లో కూడా ఈ 'స్పెషల్ రైయిడ్స్' ముమ్మరంగా కొనసాగుతాయని... రాష్ట్రంలో మొత్తం 25,987 విద్యాసంస్థల బస్సులుండగా, ఇప్పటి వరకు 23,204 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయి. మిగిలిన 2,783 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరై సర్టిఫికెట్ తీసుకోవాలని రవాణా శాఖ సూచించింది. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి పెద్ద విద్యాసంస్థలైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పంపే వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్లను ముందుగానే సరిచూసుకోవాలని రవాణా శాఖ సూచించింది.

యాదాద్రిలో ప్రైవేటు చిచ్చు..

మొదటిపేజీ తరువాయి...

యంత్రాంగం వేసిన అడుగులు ఇప్పుడు తెలంగాణ విద్యుత్ రంగంలో తీవ్ర కలకలం రేపుతుతోంది. రూ.వేల కోట్ల ప్రజాధనంతో నిర్మితమైన దేశంలోనే నాలుగో అతిపెద్ద ప్రాజెక్టును లాభనష్టాల బేరీజుతో ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడాన్ని కార్మిక లోకం జీర్ణించుకోలేకపోతోంది. ఒకవైపు భూములు కోల్పోయిన దామరచర్ల రైతులు న్యాయమైన పరిహారం కోసం నేటికీ కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతుంటే.. మరోవైపు ఉన్న ఉద్యోగాలకూ ఎసరు పెడుతూ కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన ప్రైవేటు బెండర్లు స్థానికుల కడుపు మంటను మరింత పెంచుతుండడం గమనార్హం.

రూ.37 వేల కోట్ల బడ్జెట్ దారా దత్తమా..?

నాడు కేసీఆర్ శంకుస్థాపన చేసినప్పుడు ఈ 4వేల మెగావాట్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.20,599 కోట్లు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ కాలయాపన, నిర్వహణా లోపాల వల్ల నేడు ఈ బడ్జెట్ ఏకంగా రూ.37,000 కోట్లకు చేరింది. ఇంతటి భారీ ప్రజాధనంతో, ప్రభుత్వ రంగంలో వెలుగులు నింపుతుందని ఆశించిన ప్రాజెక్టును.. తీరా చూస్తే ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేసేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధపడటం దారుణమనే విమర్శలు వస్తున్నాయి. భారీ బడ్జెట్‌ను సాకుగా చూపిస్తూ, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు వేస్తోందని నిపుణులు మండిపడుతున్నారు. ఎలాంటి హడావుడి లేకుండా గుట్టుచప్పుడు కాకుండా నోటిఫికేషన్ జారీ చేయడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రూ.255 కోట్ల అంచనా విలువతో.. మూడేళ్ల కాలపరిమితికి ఈ ఓపెన్ టెండర్ నిర్వహణ బాధ్యతలను ఆంధ్రా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. జూన్ 12న టెండర్ల ప్రక్రియ ప్రారంభించి, జూలై 2న ఓపెన్ చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ తొందరపాటు వెనుక అసలు అంతర్యమేమిటని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

తక్కువ వేతనాలు.. ఉద్యోగ గ్యారంటీ సున్నా..

కాంగ్రెస్ సర్కారు తీసుకున్న ఈ తుగ్లక్ నిర్ణయం వల్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న 1,300 మంది విద్యుత్ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ ప్లాంట్ ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్తే కార్మికుల బతుకులు పూర్తిగా అంధకారమే కానున్నాయి. కార్పొరేట్ యాజమాన్యాలు వస్తే.. ఉద్యోగులకు కనీస వేతనాలు దక్కవు, తక్కువ జీతాలకే వెట్టిచాకిరీ చేయించుకుంటారు. స్థానిక నిరుద్యోగులకు, ల్యాండ్ లూజర్లకు ఉద్యోగ గ్యారంటీ పూర్తిగా సున్నా అవుతుంది. ఇప్పటికే ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా 450 మంది ఇంజనీర్లు, వందలాది మంది ల్యాండ్ లూజర్లు ఏకమై 'యాదాద్రి ప్లాంట్ జేఏసీ' గా ఏర్పడి రోడ్డెక్కారు. రెండు రోజుల క్రితం ప్లాంట్ ముందు జరిగిన భారీ నిరసనే దీనికి సాక్ష్యం. "వైటీపీఎస్‌ను కాపాడండి.. జెన్‌కోను రక్షించండి" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు గర్జిస్తున్నారు.

ఆరని నిర్వాసితుల కడుపు మంట..

కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి దామరచర్ల ప్రాంత రైతుల ఆవేదనే సజీవ సాక్ష్యం. ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసి భూములు కోల్పోయిన జనం నేడు రోడ్డున పడ్డారు. తమకు రావాల్సిన న్యాయమైన పరిహారం కోసం, హక్కుల కోసం నేటికీ రైతులు నల్లగొండ కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయింది. నిర్వాసితుల కడుపు మంట చల్లారకముందే ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలకూ ఎసరు పెడుతూ ఈ ప్రైవేట్ టెండర్లు తీసుకురావడం కాంగ్రెస్ మార్క్ ప్రజా వ్యతిరేక పాలనకు అద్దం పడుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి, అధికారంలోకి రాగానే వేల కోట్ల ప్రజా ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టే